క్లుప్తంగా

డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ టైపిస్టులు – స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను సంయుక్త కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ టైపిస్టులు – స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ పూర్వపు శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు పి.మణి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి లాడే వెంకటరామన్, బి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల మరమ్మతులు చేయాలి

ఎచ్చెర్ల క్యాంపస్: సెలవు రోజుల్లో మహిళలు, పురుషుల వసతి గృహాలు మరమ్మతులు చేయాలని, నిర్వహణ మెరుగ్గా ఉండాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వీసీ రజని అన్నారు. వర్సిటీలోని వసతి గృహాలను ఆమె సోమవారం పరిశీలించారు. మేనేజర్ బి.రామ కృష్ణంరాజు, ఇన్‌చార్జి చీఫ్ వార్డెన్ చినసుబ్బారావులకు పలు సూచనలు చేశారు. వసతి గృహం పునః ప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలన్నారు.

ఎన్ఎస్ఎస్ బృందానికి అభినందనలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం వాలంటీర్ల బృందం ఈనెల 16వ తేదీ నుంచి 22వ తేదీ వరకు పశ్చిమ బెంగాల్ బర్ధమాన్ జిల్లా రాణిగంజ్ కళాశాలలో జరిగిన జాతీయ సమైఖ్యత శిబిరంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తమవంతు ప్రదర్శనలు చేశారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ శిబిరంలో రంగోళి పోటీలో ద్వితీయ బహుమతి సాధించారు. 17 రాష్ట్రాలను నుంచి ఈ శిబిరంలో బృందాలు పాల్గొన్నాయి. దీంతో ఎన్ఎస్ఎస్ బృందాన్ని వర్సిటీలో వీసీ కె.ఆర్.రజిని, రెక్టార్ అడ్డయ్యలు సోమవారం అభినందించారు.

అవగాహన అవసరం

ఎచ్చెర్ల క్యాంపస్: స్వయం సహాయక సంఘాల మహిళలకు డిజిటల్ మార్కెటింగ్‌పై అవగాహన అవసరమని సెర్ప్ రీసోర్స్ పర్సన్ శివ అన్నారు. ఎచ్చెర్లలోని జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రంలో గ్రామైఖ్య సంఘ అధ్యక్షులు, వెలుగు క్షేత్రస్థాయి సిబ్బందికి సోమవారం డిజిటల్ మార్కెటింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం రాంమూర్తి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అరసవల్లిలో టెండర్లు పూర్తి

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో మొత్తం 14 అంశాలపై హక్కులకు గాను సోమవారం నిర్వహించిన టెండర్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఆలయ ఈవో వై.భద్రాజీ, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, పరిశీలకుడు, శ్రీకూర్మం ఈవో గురునాథరావుల సమక్షంలో నిర్వహించారు. ఈ ప్రక్రియలో సింగిల్ టెండర్ నిబంధనల మేరకు పూలదండలు, విద్యుత్ సామగ్రి, ప్లంబింగ్ సామగ్రి సరఫరా కోసం నిర్వహించిన మూడు టెండర్లు వాయిదా పడ్డాయి. అలాగే స్టేషనరీ, కంప్యూటర్ సామగ్రి, ప్రింటింగ్ మెటీరియల్స్‌తో పాటు క్లాతింగ్ మెటీరియల్స్ సరఫరా టెండర్లు నెగోషియేషన్ (చర్చలు) విధానంలో ఖరారు చేయనున్నామని నిర్వాహక అధికారులు ప్రకటించారు. ఇక సెల్‌ఫోన్లు భద్రపరిచే హక్కు టెండర్ ఏకంగా రూ.15.25 లక్షలకు ఖరారయ్యింది. మొత్తం ఈ టెండర్ కోసం 15 మంది పోటీపడగా, కాకినాడ జిల్లా తుని మండలం పి.తిమ్మాపురం గ్రామానికి చెందిన పవన్‌సూర్య ట్రేడర్స్ అధినేత పి.సూరన్న ఈ టెండర్‌ను దక్కించుకున్నారు. ఇక అన్నదానానికి కూరగాయల సరఫరా టెండర్‌ను స్థానికుడు రాయిపల్లి అర్జున్, పాలు, పెరుగు సరఫరా టెండర్‌ను పి.తిరుమలరావు, ప్రసాదాల కవర్లు టెండర్‌ను ఎం.శ్రీనివాసరావు, డి.వంశీలు దక్కించుకోగా, ప్రసాదాల ప్యాకింగ్ టెండర్‌ను స్థానికుడైన ఎం.ఉపేంద్ర, ప్రోటోకాల్ ఫొటోల సరఫరా టెండర్‌ను స్థానిక ఎస్‌వీజీ ఆర్ట్ గ్యాలరీ అధినేత కర్రి అశోక్‌కుమార్, గోశాల దాణా సరఫరా టెండర్‌ను వప్పంగికి చెందిన యు.లక్ష్మణరావులకు టెండర్లు దక్కాయి. ఇదిలావుంటే సోమవారం నాటి టెండర్ల ప్రక్రియలో స్థానిక టీడీపీ నేతల హాజరు స్థానికంగా చర్చనీయాంశమైంది.

భద్రం బీ కేర్ ఫుల్ బ్రదరూ..!



పిసిని కూడలిలో దిగువ అండర్ పాసేజ్ రోడ్డు వద్ద స్పీడ్ బ్రేకర్లు లేని ప్రదేశం



పిసిని సర్వీస్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ఇటీవల ప్రమాదం జరిగిన దృశ్యం(ఫైల్)

- సర్వీస్ రోడ్డుల్లో కనిపించని స్పీడ్ బ్రేకర్లు
- తరచూ ప్రమాదాలు జరుగుతున్న వైనం
- నివారణ చర్యలు చేపట్టని హైవే అధికారులు

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గంలో రణస్థలం, లావేరు మండలాల్లోని పలు ప్రాంతాలు రోడ్డు ప్రమాదాలకు చిరునామాగా మారుతున్నాయి. వాహనాలు నడిపే వాహనదారుల సౌకర్యార్థం జాతీయ రహదారుల సంస్థ ఇటీవల వేగవంతంగా గమ్యస్థానాలకు చేరుకునేలా రహదారులు సిద్ధం చేశారు. అయితే జాతీయ రహదారి పక్కనుంచి గ్రామాల్లోకి వెళ్లే రహదారులు, వంతెన కింద అండర్ పాసేజ్ రోడ్లు కలిసే ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలబారిన పడుతున్నారు. సర్వీస్ రోడ్డులో అతివేగంగా వచ్చే వాహనదారులు, ఫ్లై ఓవర్ కింద అండర్ పాసేజ్ వే నుంచి వచ్చే వాహనాదారులకు సరైన వేగ నియంత్రణ లేకపోవడంతో నిత్యం ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఎక్కడ

జాతీయ రహదారుల సంస్థ ఫ్లై ఓవర్లు నిర్మించే చోట పల్లెలు, పట్టణాల వైపు దారిమళ్లే సర్వీస్ రోడ్లలో వేగ నియంత్రణ సూచిక బోర్డులు, జీబ్రా క్రాసింగ్ లైన్లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. అయితే రణస్థలం మండలంలోని రణస్థలం టౌన్, కోష్ట, పతివాడపాలెం, పిసిని నెలివాడ జంక్షన్, పైడిభీమవరం వంటి ఫ్లై ఓవర్ ప్రాంతంలో అండర్ పాస్ కలిసే చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయలేదు. దీంతో ఆయా కూడళ్లలో తరుచూ ప్రమాదాలు జరుగుతూ వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. రోడ్డు ప్రమాదాలపై నష్ట నివారణ చర్యలు చేపట్టాల్సిన హైవే అధికారులు ఆదిశగా ప్రయత్నాలు చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల పిసిని కూడలిలో అండర్ పాసేజ్ వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ఆర్టీసీ బస్సు, ఒక ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇజ్జాడ త్రినాథ అనే వ్యక్తి మృతి చెందడంతో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. అలాగే పతివాడపాలెం, కోష్ట, పైడిభీమవరం తదితర ప్రాంతాల్లోనూ నెలకు మూడు నాలుగు ప్రమాదాలు జరిగి తీవ్రగాయాలు పాలవుతున్నారు. ఇటువంటి ప్రమాదాలు జరగకుండా తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



నెలివాడ కూడలిలో అండర్ పాసేజ్ వద్ద స్పీడ్ బ్రేకర్లు లేని దృశ్యం

చర్యలు చేపడతాం

సర్వీస్ రోడ్డులో ఎక్కడెక్కడ స్పీడ్ బ్రేకర్లు అవసరమో ఆయా చోట్ల పరిశీలించి నివారణ చర్యలు చేపడతాం. ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాల్సిన అవసరం ఉంది.

– సీహెచ్ సతీష్, డిప్యూటీ మేనేజర్, ఎన్‌హెచ్‌ఏఐ

ఏర్పాటు చేయాలి

సర్వీస్ రోడ్డులో అండర్ పాసేజ్ రోడ్డు కలిసే చోట వాహనదారులు వేగంగా రావడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయి. వేగ నియంత్రణ కోసం ఫ్లై ఓవర్ అండర్ పాసేజ్ వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. పిసిని కూడలి వద్ద స్పీడ్ బ్రేకర్ లేకపోవడం వలన తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

– రెడ్డి విశ్వేశ్వరరావు, సర్పంచ్, పిసిని గ్రామం

పారిశుద్ధ్య పనులు



జి.సిగడాం మండలంలోని పాలఖండ్యాం, సంతవురిటి గ్రామాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులను చేపడుతున్నారు. సోమవారం పలు కాలువల్లో ఉన్న చెత్తను సర్పంచ్‌ల సమక్షంలో తొలగించారు. గ్రామాల్లో అంటురోగాలు ప్రబలకుండా ఉండేందుకు అన్ని వీధుల్లో పరిశుభ్రత కార్యక్రమం ద్వారా కాలువల్లో పూడికల తీత, బ్లీచింగ్ వేయడంతోపాటు ఇతర పనులు చేస్తున్నామని పంచాయతీ కార్యదర్శులు గౌరీశ్వరి, హిమబిందు అన్నారు. – జి.సిగడాం

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం సోమవారం చేపట్టారు. మొక్కలను నాటడంతో పాటు సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు. – శ్రీకాకుళం పాతబస్టాండ్

వినూత్న నిరసన



శ్రీకాకుళం మున్సిపల్ కార్మికులకు సకాలంలో పనిముట్లు ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కల్యాణి అప్పలరాజులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శ్రీకాకుళం నగరంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ అనుబంధ సంఘ ఆధ్వర్యంలో సోమవారం వినూత్నంగా చెట్టు కొమ్మలతో నిరసన తెలియజేశారు. మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పారలు, బుట్టలు, చీపుర్లు, పుష్‌కట్ వాహన సిబ్బందికి భద్రత పరికరాలు ఇవ్వాలని, కార్మికులందరికీ ప్రమాద బీమా పాలసీలు అమలు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు కె.వేణుగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు. – శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

న్యాయవాదుల నిరసన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: అనంతపురం జిల్లా మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీనియర్ న్యాయవాది వీవీ శేషాద్రిని సివిల్ కేసులో విచారణ పేరుతో పోలీస్‌స్టేషన్‌కు పిలిచి మానసిక క్షోభకు గురిచేయడంతో ఆయన మృతి చెందారని న్యాయవాదులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పోలీసుల తీరుపై సోమవారం జిల్లా కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. పోలీసుల దాష్టికాలు పరాకాష్టకు ఇది నిదర్శనమన్నారు. సంబంధింత పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ తరపున నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ర్యాలీ చేశారు. న్యాయవాదులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి ఈశ్వరరావు, కార్యదర్శి రేగాన ప్రసన్నకుమార్, బార్ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు, ఏపీ బీసీ అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు, కె.సుభాష్, సనపల హరి, పిట్ట దామోదర తదితరులు పాల్గొన్నారు.

మాన్యువల్ స్కావెంజర్ వ్యవస్థకు స్వస్తి పలకాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: మాన్యువల్ స్కావెంజర్స్ వ్యవస్థకు స్వస్తి పలకాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మాన్యువల్ స్కావెంజర్స్ వ్యవస్థ నిర్మూలనపై మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారి, సంబంధిత అధికారులతో జిల్లా విజిలెన్స్ కమిటీ (మాన్యువల్ స్కావెంజర్స్ చట్టం – 2013) సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. క్షేత్రస్థాయిలో మాన్యువల్ స్కావెంజర్స్‌గా ఉండేవారిని వెంటనే గుర్తించాలని, వారి సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలోని కార్పొరేషన్, మున్సిపాలిటీలు, పంచాయతీల్లో సఫాయి కర్మచారులకు అవసరమైన సదుపాయాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నిబంధనల ప్రకారం వారికి మాస్క్, గ్లౌజులు, షూలు, ఆయిల్, సోప్, హెల్మెట్, సేఫ్టీ ప్యాక్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, తదితర రకాల భద్రతా పరికరాలు, ఇతర సదుపాయాలు కల్పించాలన్నారు. వారి కుటుంబ సభ్యులకు వివిధ పథకాల కింద అర్హత కలిగిన వారికి రుణాలు ఇచ్చేందుకు మానవతా దృక్పథంతో ఆలోచించాలన్నారు. సమావేశంలో నరసన్నపేట, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, సోషల్ వెల్ఫేర్ డీడీ విశ్వమోహన్ రెడ్డి, డీపీవో భారతి సౌజన్య, శ్రీకాకుళం, టెక్కలి ఆర్డీవోలు సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, సభ్యులు ఎన్.బలరాం, తి.తిరుపతిరావు, వేణు గోపాల్, అప్పలరాజు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల సాధికారతకు శిక్షణ కేంద్రం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో ఎచ్చెర్ల నియోజకవర్గంలోని డా.బీఆర్ అంబేడ్కర్ నైపుణ్యాభివృద్ధి శిక్షణా కేంద్రం పేరిట ఒక నూతన కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. ఈ కేంద్రం ద్వారా జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలను పెంపొందించనున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పౌర హక్కుల పరిరక్షణ, అత్యాచార నిరోధక చట్టంపై జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీతో సమీక్ష సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేంద్ర నిర్మాణం కోసం న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు లేఖ రాశామన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం పకడ్బందీగా అమలు జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో హిందీ బోధిస్తున్న ఉపాధ్యాయులు రూపొందించిన 'హిందీ ఫోరం' క్యాలెండర్‌ను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సోమవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. జిల్లాలోని పాఠశాలల్లో హిందీ చదువుతున్న విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ, భాషను మాట్లాడేవారి సంఖ్య తక్కువగా ఉందన్నారు. ఈ పరిస్థితిని మెరుగుపరచడానికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని అభినందించారు. హిందీ భాషా ప్రావీణ్యతను పెంపొందించడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని, విద్యార్థులు హిందీలో మాట్లాడే వాతావరణాన్ని సృష్టించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య, ఫోరం ప్రతినిధులు ఐ.సంతోష్ కుమార్, కె.శ్రీనివాసరావు, ఎస్.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై దాడి



శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని టౌన్ హాల్ సమీపంలో ఒక వృద్ధురాలిపై ఇద్దరు యువకులు దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. ఒకటో పట్టణ ఎస్ఐ హరికృష్ణ తెలిపిన వివరాల మేరకు.. లావేరు మండలం మురపాకకు చెందిన లింగాల అప్పమ్మ (51) నగరంలోని ఒక కల్యాణ మండపంలో జరుగుతున్న శుభ కార్యానికి తన చెల్లెలి కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై ఆదివారం వచ్చింది. టౌన్ హాల్ సందు సమీపంలోకి వచ్చేసరికి వేరే ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు ఎం.డి.సల్మాన్, ఎర్రయ్యలు మద్యం మత్తులో ఉండడంతో స్కిడ్ అయిపోయి కింద పడిపోయారు. ఎదురుగా ఉన్న అప్పమ్మ చెల్లెలి కుమారుడి వలనే తాము కిందకు పడిపోయామని, ఒక్కసారిగా చేతికున్న కడియంతో ఇద్దరిపై దాడి చేశారు. దీంతో అప్పమ్మ కుడి కంటి కింది భాగంలో తీవ్ర గాయమైంది. స్థానికులు వెంటనే ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితురాలిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

పరామర్శ



రవిని పరామర్శిస్తున్న కృపారాణి దంపతులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ మీడియా సెల్ ఇన్‌చార్జి మండవల్లి రవి తల్లి ఇటీవల మృతి చెందడంతో ఆయనను కేంద్ర మాజీమంత్రి కిల్లి కృపారాణి, రామ్మోహన్ దంపతులు సోమవారం పరామర్శించారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. అండగా ఉంటామని రవికి ధైర్యానిచ్చారు.

అయోడిన్ లోపంతో అనారోగ్యం

ఎచ్చెర్ల: అయోడిన్ లోపంతో అనారోగ్యం బారిన పడతామని ఢిల్లీకి చెందిన ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డవలప్‌మెంట్ సభ్యులు అన్నారు. లావేరు మండలంలోని మురపాక కేజీబీవీలో కళాజాత కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఐజీడీ జిల్లా కో–ఆర్డినేటర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ అయోడిన్ తీసుకోకపోతే డ్రై స్కిన్, ఎదుగుదలలో లోపం, థైరాయిడ్, బలహీనత, రక్తహీనత అనేది ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో మండల అవుట్ రీచ్ వర్కర్ రెడ్డి ఆనంద్, ప్రిన్సిపాల్ బి.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలి

ఎచ్చెర్ల క్యాంపస్: యువత పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ లీడ్ బ్యాంకు మేనేజర్ ఉమాశంకర్ అన్నారు. ఎచ్చెర్లలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ స్కిల్ హబ్‌లో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు నిర్వహించిన మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి సాయి కుమార్, యూనియన్ బ్యాంక్ శిక్షణ కేంద్రం డైరెక్టర్ శ్రీనివాసరావు, స్కిల్ కాలేజీ కో–ఆర్డినేటర్ఢిల్లీశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

బాక్సింగ్ పోటీల్లో సత్తాచాటండి

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో సత్తాచాటి జిల్లాకు, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఎస్ఎస్ఆర్ ట్రస్ట్ అధినేత, జిల్లా బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ సూర శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఇటీవల పిఠాపురం వేదికగా జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్స్ బాక్సింగ్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను శ్రీకాకుళంలోని ఆయన నివాసంలో సోమవారం అభినందించారు. ఉత్తరప్రదేశ్‌లో జనవరి 3 నుంచి జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ప్లేయర్స్‌ను అభినందించి, ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్ ఉమామహేశ్వరరావు, వాలీబాల్ కోచ్ కె.హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు జిల్లాకు గర్వకారణం

శ్రీకాకుళం న్యూకాలనీ: అనతికాలంలో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాల పంట పండిస్తున్న సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు జిల్లాకు గర్వకారణమని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఇటీవలి జమ్మూకాశ్మీర్‌లో జరిగిన జాతీయస్థాయి సబ్ జూనియర్స్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ బాలురు జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. ఏపీ జట్టుకు శ్రీకాకుళం నుంచి కేశవరావుపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో చదువుతున్న చింతాడ జశ్వంత్, మెట్ట హర్షవర్దన్, పూజారి కళ్యాణ్‌రామ్‌లు ప్రాతినిధ్యం వహించారు. దీంతో విద్యార్థులను, పీడీ, కోచ్ ఎంపీ రమణలను ఎమ్మెల్యే రవికుమార్ అభినందించారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ సంఘ జిల్లా అధ్యక్షుడు కలిదిండి నరసింహరాజు, కార్యదర్శి సిగిలిపల్లి లక్ష్మీదేవి, కన్వీనర్ కలిదిండి వెంకటరామరాజు, మొజ్జాడ వెంకటరమణ, బి.హరిధరరావు, మెట్ట తిరుపతిరావు, బి.సురేష్, పేడాడ బాబూరావు, జి.రాజశేఖర్ పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనపై అవగాహన

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పరిశ్రమల స్థాపనపై అవగాహన అవసరమని జిల్లా పరిశ్రమల కేంద్ర సహాయ సంచాలకుడు పి.వి.రఘునాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆర్ఎంఎంపీ పథకం కింది రాష్ట్రంలో ఎంటర్‌ప్రెన్యువర్, స్కిల్ డవలప్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ వర్క్‌షాప్‌లను జిల్లాలో మూడు ప్రాంతాలు శ్రీకాకుళం, ఎచ్చెర్ల, పలాసలో త్వరలో నిర్వహించబడుని తెలిపారు. ఈ కోర్సుల్లో నెల రోజుల పాటు పరిశ్రమల స్థాపనలో అవసరమైన వివిధ అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసినవారికి సర్టిఫికెట్స్ ఇవ్వబడునని పేర్కొన్నారు.

ఆ నేత్రాలు సజీవం



శ్రీరామమూర్తి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కంపోస్టు కాలనీలో నివాసముంటున్న పేకాల శ్రీరామమూర్తి (88) అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందారు. దీంతో మరణాంతరం ఆయన నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే సదుద్దేశంతో ఆయన కుటుంబ సభ్యులు పేకాల లక్ష్మణరావు, హేమ సుందరరావు, సీఐటీయూ కార్యదర్శి తేజేశ్వరరావు, కుమార్తెలు రెడ్‌క్రాస్ చైర్మెన్ పి.జగన్మోహనరావుకు తెలియజేశారు. దీంతో నేత్ర సేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి పి.సుజాత, నంది ఉమాశంకర్‌లు అతని కార్నియాలను సోమవారం సేకరించి విశాఖలోని ఎల్వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, సభ్యుడు దుర్గాశ్రీనివాస్‌లు అభినందించారు. నేత్రదానం చేయాలనుకునేవారు 78426 99321 నంబర్‌కు కాల్ చేయాలని కోరారు.

జనవరి 4న సర్వసభ్య సమావేశం

రణస్థలం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పిన్నింటి రజిని అధ్యక్షతన జనవరి 4వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు హాజరవ్వాలని కోరారు.

